

వికారాబాద్ : కలెక్టరేట్‌లో గణనాథుడికి పూజలు చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ దంపతులు

కొలువుదీరిన లంబోదరులు

రెండు జిల్లాల్లో ఘనంగా వినాయక చవితి వేడుకలు



మోమిన్‌పేట్: టేకులపల్లిలో వినాయకుడికి మండపం వద్ద హోమంలో భక్తులు



ధారూరులో వినాయకుడి వద్ద పిల్లలకు అక్షరాభ్యాసం

వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ప్రజలు వినాయక చవితి వేడుకలను వైభవంగా జరుపుకుంటున్నారు. గల్లీగల్లీలో గణనాథులు శోభాయమానంగా కొలువుదీరారు. ప్రత్యేకంగా రూపొందించిన మండపాలు, ఇళ్లలో లంబోదరులను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులు సందడి చేస్తున్నారు. వికారాబాద్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మహాగణపతికి కలెక్టర్‌ప్రతీక్ జైన్ సతీసమేతంగా పూజలు నిర్వహించారు. వినాయకచవితి సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయక నవ రాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించాలని సూచించారు.

- ఆంధ్రజ్యోతి , నెట్‌వర్క్, సెప్టెంబరు 8



పరిగి: బ్రాహ్మణవాడ శివాలయంలో గణపతికి పూజలు

వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు తగ్గినట్టే తగ్గి మళ్లీ ఉధృతమయ్యాయి. ప్రజలు ఆ వరదల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సమయంలో మళ్లీ శని, ఆదివారాల్లో వర్షం దంచి కొట్టింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు ఉప్పొంగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పదుల సంఖ్యలో ఇళ్లు కూలిపోయాయి. భారీగా వరద నీరు చేరడంతో వందల ఎకరాల్లో పంటపొలాలు నీటమునిగాయి. రోడ్లపై వరద నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎడతెరపిలేకుండా కురిసిన వర్షానికి తలకొండపల్లి మండలం దేవునిపడకల్ ఈరన్న చెరువు తెగిపోయింది. కడ్తాల మండలం చెల్లంపల్లిలో చెరువు కట్ట తెగి నీరంతా వృథాగా పోయింది. వికారాబాద్ జిల్లా మెట్ల కుంట బొంరాస్‌పేటలోని లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి వరద నీరు చేరడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు. బొంరాస్‌పేట్ పెద్ద చెరువుకు వచ్చే కాలువకు గండి పడింది.

- బొంరాస్‌పేటలో ఇళ్లలోకి చేరిన వరద నీరు
- తెగిన చెల్లిపల్లి, దేవునిపడకల్-ఈరన్న చెరువులు
- చుక్కాపూర్‌లో అత్యధికంగా 111.8మి.మీ వర్షపాతం నమోదు
- దెబ్బతిన్న రోడ్లు.. నిలిచిన రాకపోకలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువులు, కుంటలు
- వందల ఎకరాల్లో నీట మునిగిన పంటలు

తగ్గినట్టే తగ్గీ..

దంచికొట్టింది

ఉమ్మడి జిల్లాలో కురిసిన భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం



కడ్తాల్ : చల్లంపల్లిలో తెగిపోయిన శామాషీ కుంటకట్ట

గడిచిన 24 గంటల్లో కురిసిన వర్షపాతం(మి.మీలలో)

మండలం	ప్రాంతం	నమోదు (మి.మీ)
రంగారెడ్డి జిల్లా.		
తలకొండపల్లి	చుక్కాపూర్	111.8
ఆమనగల్లు	ఆమనగల్లు	98.5
కేశంపేట	సంఘం	74.3
కొందుర్గు	కొందుర్గు	66.8
కేశంపేట	కేశంపేట	66.8
మాడ్గుల	మాడ్గుల	60.5
ఫరూక్‌నగర్	తొమ్మిడిరేకుల	54.5
వికారాబాద్ జిల్లా..		
యాలాల	దవలాపూర్	88.8
బొంరాస్‌పేట్	బొంరాస్‌పేట్	81.8
కులకచర్ల	ముజాహిద్‌పూర్	73.0
బషీరాబాద్	బషీరాబాద్	68.0
పరిగి	రాపోల్	62.5
దోమ	దోమ	61.8

జలమయమైన నారాయణపూర్

భారీ వర్షాలకు వికారాబాద్ జిల్లా పరిగి మండలం నారాయణపూర్ ఊరంతా జలమయమైంది. ఇళ్లలోకి భారీగా వరద నీరు చేరడంతో రాత్రంతా గ్రామస్తులు నానా అవస్థలు పడ్డారు. పరిగి పట్టణంలోని పలు కాలనీల్లోకి వరద అధికంగా రావడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పరిగి-మల్కాపూర్‌ల మధ్య రోడ్డు గుంతలమయంగా మారింది. నారాయణపూర్, లక్ష్మీదేవిపల్లి, రాఘవాపూర్, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో వందల ఎకరాల్లో పత్తి పంట నీటమునిగిందని రైతులు వాపోతున్నారు.



వరదకు కొట్టుకుపోయిన గంగన్నగూడ రోడ్డు

ఆంధ్రజ్యోతి, ఉమ్మడి జిల్లా నెట్‌వర్క్, సెప్టెంబరు 8: ఉమ్మడి జిల్లాలో శని, ఆదివారాల్లో కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి చెరువు, కుంటలు నిండుకుండలను తలపిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు సురసముద్రం చెరువులోకి భారీగా వరద నీరు చేరుతోంది. తలకొండపల్లి మండలం చీపునుంతల, చుక్కాపూర్, యెడవల్లి చెరువులు నిండి అలుగులు పారుతూ దిగువన ఉన్న ఆమనగల్లు చెరువులోకి వరద చేరుతోంది. వర్షాల తాకిడికి చెరువు కట్ట నడిమి తూము సమీపంలో గతంలో మట్టి పోసిన చోట కుంగింది. దీంతో అప్రమత్తమైన మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య , కమిషన్ వసంత, సీఐ ప్రమోద్ కుమార్, ఎస్‌ఐ వెంకటేశ్, ఇరిగేషన్ శాఖ ఏఈ తిరుపతయ్య లు చెరువును పరిశీలించి మరమ్మతుకు ఆదేశించారు. కట్ట కింది భాగంలో ఉన్న బీసీ కాలనీ ప్రజలను అప్రమత్తం చేశారు. ఇళ్లను ఖాళీ చేయాలని, ఫంక్షన్ హాల్‌లో పునరావాసం కల్పిస్తామని కమిషనర్ వసంత తెలిపారు.

రెండేళ్ల తర్వాత చెరువు నిండి అలుగు పారుతుండడంతో చూడడానికి పట్టణ ప్రజలుబారులు తీరారు. అదేవిధంగా మేడిగడ్డ-శంకర్ కొండ రోడ్డులో రాకపోకలు స్థంభించాయి. కత్వవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. శెట్టిపల్లి- చరికొండ రోడ్డులో పెద్దఎత్తున వరద పారుతుండడంతో రాకపోకలకు ప్రజలు, రైతులు ఇబ్బందులు పడ్డారు. వేముల చెరువు కింది భాగంలోకి పెద్ద ఎత్తున నీరు చేరడంతో జొన్న, పత్తి, వరిపంటలు నీట మునిగాయి. మేడిగడ్డ కత్వ వాగు వద్ద మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసమై నీరు వృథాగా పోయింది.

పలుచోట్ల తెగిన కుంట కట్టలు

కడ్తాల్ మండలం చల్లంపల్లి గ్రామ సమీపంలోని నాగుల చెరువు, శామాషీ కుంటలకు గండిపడింది. భారీ వదరలకు ఎక్వాయిపల్లి- మర్రిపల్లి రోడ్డు చాలా చోట్ల దెబ్బతింది. మండలంలో

మిగతా 7వ పేజీలో...



జీవన్గి శివారులో నీట మునిగి కుళ్లిపోయిన పత్తి పంట



పరిగి మండలం నారాయణపూర్‌లో ఇంట్లోకి చేరిన నీరు

నీట మునిగి కుళ్లిన పత్తి పంట

వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల వ్యాప్తంగా సుమారు 8వేల ఎకరాలకు పైగా పత్తి, 4వేల ఎకరాల్లో కంది వంటి ప్రధాన పంటలు సాగుచేశారు. ఇటీవల నవాంద్గీ, జీవన్గి సమీపంలో కాగ్నానది ఉప్పొంగి ప్రవహించగా, వరద నీరు పత్తి, వరి పొలాల్లోకి చేరి చెరువులను తలపించాయి. సుమారు 50 ఎకరాల వరకు పత్తి, ఇతర పంటలు నీట మునిగాయి. పొలాల్లో రోజుల తరబడి వర్షం నీరు నిలువ ఉండడంతో ఏపుగా పెరిగిన పంటలు కుళ్లిపోతున్నాయి. సుమారు 1,500 ఎకరాల వరకు పత్తి, కంది, ఇతర పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.



ఉధృతంగా ప్రహిస్తున్న లక్నాపూర్ ప్రాజెక్టు

- ఏడెకరాల చెరువు భూమిని మాయం చేసిన రియల్టర్లు
- ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా రోడ్ల నిర్మాణం
- తుక్కుగూడ బల్దియా పరిధిలో చెరువుల శిఖం ఆక్రమణ
- సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- త్వరలో మహేశ్వరం, తుక్కుగూడల్లో హైడ్రా పరిశీలన
- ఆక్రమణదారుల్లో మొదలైన ఆందోళన

తుమ్మలకుంటను మింగిన వెంచర్



తుమ్మలకుంటలో వెలసిన నిర్మాణాలు

మహేశ్వరం మండలంతో పాటు తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని పలు చెరువులు, కుంటలు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. మండలంలోని మొత్తం 115 చెరువుల్లో చాలా వరకు ఆక్రమణలకు గురయ్యాయి. సర్దార్‌నగర్‌లోని తుమ్మలకుంట మాత్రం పూర్తిగా మాయమైంది. అలాగే ప్రభుత్వ భూములను సైతం ఆక్రమించి యథేచ్ఛగా రోడ్లను నిర్మించి రియల్ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.

కబ్జాల పర్వం 9

మహేశ్వరం, సెప్టెంబరు 8: మహేశ్వరం మండలంలో మొత్తం 115 చెరువులు ఉండగా ఇందులో మహేశ్వరం, తుమ్మలూరు, రావిర్యాల, సర్దార్‌నగర్, మంఖాల్, తుక్కుగూడ, అమీర్‌పేట, దుబ్బచర్ల, పోరండ్ల, చిన్నతూప్రా, సిరిగిరిపురం, గొల్లూరు గ్రామాలలోని చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురయ్యాయి. ఒక్క సర్దార్‌నగర్‌లోని తుమ్మలకుంట మాత్రం పూర్తిగా మాయమైంది. చెరువు కుంటలతో పాటు ప్రభుత్వ భూములను సైతం ఆక్రమించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. చెరువు కుంటలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా నగర శివారు ప్రాంతాలపైనా దృష్టి సారించింది. దీంతో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కాగా, ఇప్పటికే బాలాపూర్, మీర్‌పేట్, బడంగ్‌పేట తదితర ప్రాంతాలోల్లని చెరువులు పూర్తిగా ఆక్రమణలకు గురి కావడంతో వాటిని హైడ్రా అధికారుల పరిశీలనలు ప్రారంభమయ్యాయి.

20 ఎకరాల ఆయకట్టు

తక్కుగూడ మున్సిపాలిటీ సర్దార్‌నగర్ గ్రామంలో మంఖాల్ సర్వే నంబర్ 131లో 65 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమికి ఆనుకొని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి 30 ఎకరాల్లో భారీ వెంచర్ వేశారు. ఈ వెంచర్‌కు దారి లేకపోవడంతో ప్రభుత్వ భూమిలో నుంచి 40 ఫీట్ల వెడల్పుతో రోడ్డు వేశారు. అంతే కాకుండా వెంచర్ వేసిన భూమిలోనే నీటిపారుదల శాఖ రికార్డుల్లో సర్వే నంబర్ 2 లో తుమ్మల కుంట పేరుతో దాదాపు 7 ఎకరాల చెరువు ఉండేది. ఆ చెరువు కింద సుమారు 20 ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు ఆ రికార్డుల ద్వారా తెలుస్తోంది. పట్టా భూమిలో తుమ్మల కుంట చెరువు ఉందన్న కారణంతో ఆ చెరువును నామరూపాలు లేకుండా చేసి 2005లోనే వెంచర్ వేశారు. అయితే చెరువు కబ్జాకు గురవుతుందని సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన కొందరు రైతులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ విషయం తెలియని వారు ఆ వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేస్తే మాత్రం ఎప్పుడో ఓ రోజు అవి నీట మునగక తప్పదని తుమ్మలకుంట పరిసర ప్రాంత ప్రజలు, రైతలు హెచ్చరిస్తున్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

తుమ్మలకుంట చెరువు కనిపించకుండా పోయిందని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ కె. మధుమోహన్ పహాడిషరీఫ్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అలాగే రావిర్యాల పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో దాదాపు 40 ఎకరాల వరకు ఆక్రమించి అందులో వెంచర్లు ఏర్పాటు చేశారు. వెంచర్లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా హైడ్రా దృష్టి సారించి చెరువు, కుంటలతో పాటు ఎఫ్‌టీఎల్ పరిధులను కాపాడాలని రావిర్యాల చెరువు ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

అంతర్రాష్ట్ర గొర్రెల,మేకల దొంగలు అరెస్టు

పూడూరు, సెప్టెంబరు 8: అంతర్రాష్ట్ర గొర్రెలు, మేకల దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. పూడూరు మండలంలోని మన్నెగూడ చౌరస్తాలో శనివారం రాత్రి పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో నెంబర్‌ప్లేట్ లేని రెండు స్కార్పియో వాహనాలను తనిఖీ చేస్తుండగా, వాహనంలో ఉన్న ప్రభు, కైలాష్ చౌహాన్ అనే వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని పట్టుకుని చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. వీరు గొర్రెలు చోరీ చేయడానికి వీలుండే ప్రాంతాల్లో రెక్కీ చేసుకోవడానికి వచ్చినట్లు వారు వెల్లడించారు. ఇప్పటికే జిల్లాలోని పుల్‌మామిడి, రూప్‌ఖాన్‌పేట్, ఎన్కెపల్లి, గొంగుపల్లి, కంకల్, షైలారం, కుల్కచర్ల, చల్లాపూర్‌తోపాటు పొరుగు మహబూబ్‌నగర్, జోగుళాంబగద్వాల్, వనపర్తి, నారాయణపేట్, నాగర్‌కర్నూలు, కర్ణాటక రాష్ట్రంలోని పలు గ్రామాల్లో దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వీరు కర్ణాటక రాష్ట్రం యాద్గీర్ జిల్లాకు చెందిన ప్రభు, శేక్యా, చెన్నప్ప, మారుతి, రవి, భీము, దశరథ, సంజయ్‌కుఆర్. చౌహాన్, శంకర్, చొంగయ్య, కైలాష్ చౌహాన్, కందప్ప, ముదుకప్ప వీరంతా ఒక గ్యాంగ్‌లా ఏర్పడి చోరీలు చేస్తున్నారు. వీరంతా గొర్రెలు, మేకలను చోరీ చేసి వెంటనే విక్రయించకుండా గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో కోటల్లో పెట్టి సంతలు జరిగే రోజుల్లో వీటిని విక్రయిస్తున్నారు. ఇట్టి చోరీకి పాల్పడిన ప్రభు, కైలాష్ చౌహాన్లను అరెస్టు చేశామని, మిగిలిన తొమ్మిది మంది పరారీలో ఉన్నారని పోలీసులు వెల్లడించారు. నేరస్తుల నుంచి రెండు స్కార్పియో వాహనాలు, రెండు సెల్‌ఫోన్లు, గొర్రెలు, మేకలు అమ్మగా వచ్చిన రూ.లక్ష నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. కేసును ఛేదించిన వారిలో చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి, హెచ్‌సీఎస్ చెన్నయ్యగౌడ్, గోవిందప్ప, పీసీఎస్ కృష్ణ, రామకృష్ణలకు రివార్డులు అందజేశారు.



నిందితుల చూపుతున్న ఎస్ఐ మధు సూదనరెడ్డి



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎం.కోదండరెడ్డి, అన్వేష్‌రెడ్డి



భట్టి విక్రమార్కతో..

రేవంత్, భట్టిలను కలిసిన కోదండరెడ్డి

యాచారం, సెప్టెంబరు 8 : సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలను నగరంలోని వారి వారి నివాసాల్లో శనివారం వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని కోదండరెడ్డి వారితో చెప్పారు. రైతులను అన్ని విదాల ఆదుకునేందుకు అంకితభావంతో పని చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు చెప్పినట్లు కోదండరెడ్డి పేర్కొన్నారు. అలాగే పార్టీ బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

యాచారం/మాడ్గుల,సెప్టెంబరు 8: గణేశ్ నవరాత్రోత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. శనివారం రాత్రి మాల్‌లో గణనాథులకు సీఐలు శంకర్‌కుమార్, జగదీశ్వర్‌లతో కలిసి పూజలు చేశారు. రాత్రి పది గంటల కల్లా పూజలు, భజనలు ముగించాలని, మైక్‌లలో సినిమా పాటలు పెట్టొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు మధు, సక్రు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉత్సవాలను జరుపుకోవాలని ఏసీపీ రాజు సూచించారు. మాడ్గులలోని వాసవి ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉత్సవ కమిటీలతో సమావేశం నిర్వహించారు. మండలంలో 135 వినాయక విగ్రహాలను పెట్టారని, మండపాల వద్ద నిర్వాహకులు కాపలా ఉండాలని సూచించారు.

దెబ్బతిన్న పంటలు, కూలిన ఇళ్ల వివరాలు ఇవ్వండి

సెర్ప్ సీఈవో, జిల్లా ప్రత్యేకాధికారి దివ్యదేవరాజన్

వికారాబాద్, సెప్టెంబరు 8: వర్షాలకు దెబ్బతిన్న పంటలు, కూలిన ఇళ్లు, నష్టపోయిన పశు సంపద వివరాలపై నివేదికలు సమర్పించాలని సెర్ప్ సీఈవో, జిల్లా ప్రత్యేకాధికారి దివ్యదేవరాజన్ అధికారులకు సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వర్షాల వల్ల జరిగిన నష్టాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి దివ్యదేవరాజన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ.. వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి రైతుల వివరాలతో కూడిన నివేదికలను సమర్పించాలన్నారు. వర్షాల కారణంగా కూలిపోయిన ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడీ భవనాలతో పాటు పశు సంపద నష్టాలను కూడా సమర్పించాలని సూచించారు. దెబ్బతిన్న రహదారుల వివరాలపై పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ ఇంజనీర్లు నివేదికలు తయారు చేయాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పంట నష్టాల నివేదికలు సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని చెరువులు, కుంటల వివరాలను ఇరిగేషన్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. సోలార్ పవర్‌ప్లాంట్ నిర్మాణాలకు భూములను కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, ముందుగా సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌కు కలెక్టర్, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ జిల్లా అధికారులు మొక్కల కుండీలతో సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వికారాబాద్ మండలం ఎర్రవల్లి గ్రామంలోని పంట నష్టాలను అధికారులతో కలిసి దివ్య దేవరాజన్ పరిశీలించారు. పంట నష్టంపై తెలుసుకోవడానికి అధికారులు గ్రామాల్లోకి వస్తున్నారా? అని రైతులను అడిగి తెలుసుకోగా.. అధికారులు పొలాల వద్దకు వచ్చి వివరాలు తెలుసుకుంటున్నారని ఆమెకు వివరించారు.



ఎర్రవల్లి గ్రామంలో పంటపొలాలను పరిశీలిస్తున్న దివ్యదేవరాజన్

కొంగరఖుర్దు రైతుల వాదనను జేపీసీలో వినిపిస్తా

మహేశ్వరం, సెప్టెంబరు8: రైతులు సాగుచేసుకుంటున్న భూములకు సంబంధించి వారి వాదనను జేపీసీ (జాయింట్ పార్లమెంటరీ కమిటీ)లో వివరిస్తానని ఎంపీ డీకే అరుణ అన్నారు. కాగా, మహేశ్వరం మండలం కొంగరఖుర్దు రెవెన్యూలో వంద సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్న రైతులకు తగిన న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. ఈమేరకు తమకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం శ్రీరాములు యాదవ్ ఆధ్వర్యంలో కొంగరఖుర్దు రెవెన్యూ పరిధిలోని రైతులు కేంద్ర జాయింట్ పార్లమెంటరీ కమిటీ మెంబర్ డీకే అరుణను హైదరాబాదులోని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ కొంగరఖుర్దు రైతులు గత వంద సంవత్సరాల నుంచి దాదాపు ఆరు వందల ఎకరాల భూముల్లో సాగు చేసుకుంటున్నారని చెప్పారు. ఆ భూములు తమవేనంటూ 1962లో రికార్డులను అక్రమంగా మార్పిడి చేసి.. ఇది దర్గా వక్ఫ్ భూమి అని గెజిట్ తీయడానికి మజ్లిస్ పార్టీ యత్నించగా స్థానిక రైతులు హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చారని అరుణకు వివరించారు. దాంతో ఆమె మాట్లాడుతూ జేపీసీ ఎదుట వాదనలు వినిపించి కొంగరఖుర్దు రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు శ్రీరాములుయాదవ్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, కౌన్సిలర్లు శివకుమార్, యాదగిరిరెడ్డి, రైతులు వెంకటేష్, జంగయ్య, పర్వతాలు, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.



రైతు సమస్యలపై డీకే అరుణకు వివరిస్తున్న శ్రీరాములు యాదవ్

అభివృద్ధి పనుల్లో ప్రభుత్వ నిర్లక్ష్యం



రోడ్డును పరిశీలిస్తున్న దశరథ్‌నాయక్, వెంకటేశ్

కడ్తాల్, సెప్టెంబరు 8 : ఎక్వాయిపల్లి-మర్రిపల్లికి బీటీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన పనుల ను కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం లేదన్నారు. ఎక్వాయిపల్లి-మర్రిపల్లి రోడ్డును ఆదివారం పరిశీలించారు. వర్షాలతో రోడ్డు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు చెప్పారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని అధికారులను కోరారు. దెబ్బతిన్న చెరువు, కుంటలు, రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరారు. వారితో బీఆర్ఎస్ నాయకులు జోగు వీరయ్య, భాగ్యమ్మజంగయ్య, భాస్కర్ రెడ్డి, నర్సింహ, మల్లేశ్, కొమరయ్య, కృష్ణయ్య, బిక్షపతి, శివ ఉన్నారు.

తగ్గినట్టే తగ్గీ.. దంచికొట్టింది

(5వ పేజీ తరువాయి..)

అనేక గ్రామాల మట్టి రోడ్లు, పంట పొలాలు నీట మునిగియాయి. పొలాల్లో వరద కారణంగా ఇసుక మేటలు వేశాయి. కడ్తాల సమీపంలోని దావర చెరువు, గొర్లకుంట, మక్తమాదారం తుమ్మల, బొప్పల చెరువు, ఈర్లకుంట చెరువులు అలుగులు పారుతున్నాయి. ఇరిగేషన్ శాఖ డీఏ నరేందర్ రెడ్డి, , ఏఈ నిఖిల తెగిపోయిన చెరువు కుంట కట్టలను పరిశీలించారు. తలకొండపల్లి మండలంలో సుమారు వందకు పైగా చెరువు కుంటలు నిండి అలుగు పారుతున్నాయి. దేవునిపడకల్ గ్రామ సమీపంలోని ఈరన్న కుంట, పందివాని కుంట కట్టలు వర్షానికి తెగిపోయాయి. చీపునుంతల అమ్రాయి చెరువు, చుక్కాపూర్ యెడవెల్లి చెరువు, చుక్కాయి చెరువు, రాంపూర్ సూర్యరావు చెరువు, దేవుని పడకల్ మహ్మద్‌ఖాన్ చెరువులు నిండి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వర్షాల తాకిడికి చాలా చోట్ల రోడ్లు దెబ్బతిని రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో రాత్రి ఎడతేరిపి లేకుండా వర్షం దంచి కొట్టడంతో వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి.

పదుల సంఖ్యలో కూలిన ఇళ్లు

భారీ వర్షానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో పాత ఇళ్లు నేలకూలాయి. మెయినాబాద్ మండలం చిలుకూరు గ్రామంలో కాడిగళ్ల నర్సింహ, సంగం సామయ్యకు చెందిన రెండు పెంకుటిండ్లు కుప్పకూలాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో ఎంపీడీవో సంధ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ కూలిన ఇంటిన పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే ఆ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ సైతం కూలిపోయింది. తలకొండపల్లి మండల కేంద్రంలో వర్షానికి పోతుగంటి యాదయ్యకు చెందిన మట్టి మిద్దె కూలిపోయింది. వర్షం వస్తుండడంతో అప్పటికే అప్రమత్తంగా ఉండడం వల్ల యాదయ్య , ఆయన భార్య చెన్నమ్మ స్వల్పంగా గాయపడి ప్రమాదం నుంచి బయట పడ్డారు. వారికి బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ , మాజీ ఉప సర్పంచ్ పద్మ అనిల్ పరామర్శించారు. 25 కిలోల బియ్యం అందజేశారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలో గోవిందమ్మకు చెందిన ఇల్లు కూలిపోయింది. ధారూర్ మండలం కేరెల్లి గ్రామంలో తిప్పని నర్సింహారెడ్డి ఇల్లు కూలి పక్కన ఉన్న ఇంటిపై శిథిలాలు పడిపోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.


బొంరాస్‌పేట : పెద్ద చెరువు ఏటి కాల్వకు గండి పడటంతో వృథాగా వెళ్తున్న నీరు

నిలిచిన రాకపోకలు

పరిగి మండలం లక్నాపూర్ ప్రాజెక్టులోకి వరద నీరు ఉధృతంగా చేరుతోంది. గోడుగోనిపల్లి దగ్గర నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. బ్రాహ్మణపల్లి దగ్గర రోడ్డుపై బ్రిడ్జి లేకపోవడంతో రాకపోకలు ఆగిపోయాయి. పరిగి-నస్కల్ గ్రామాల మధ్య, మిట్టకోడూరు చెరువు దగ్గర, పరిగి-మహబూబ్‌నగర్‌ల మధ్య గోడుగోనిపల్లి దగ్గర బ్రిడ్జి దగ్గర రోడ్డుపై నీరు భారీ ప్రవహించడంతో గంటల తరబడి రాకపోకలు నిలిచిపోయాయి. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రం శివారులో గంగన్నగూడ రోడ్డు తెగింది. దీంతో ఆదివారం ఉదయం రాకపోకలు నిలిచిపోయాయి. కొందుర్గు మండల కేంద్రం శివారు రోడ్డు నుంచి గంగన్నగూడ, చెర్కుపల్లి, విశ్వనాథ్‌పూర్, జిల్లేడ్-చౌదరిగూడం మండల పరిధిలోని రావిర్యాల, కాస్లాబాద్, ఎదిర, ముష్టిపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు తెగిపోయాయి. దీంతో ఉదయం ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే వారు చెర్కుపల్లి, విశ్వనాథ్‌పూర్ లనుంచి తంగళ్లపల్లి మీదుగా కొందుర్గుకు వచ్చారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోచేగిరెడ్డి ఘణాపూర్, రావిర్యాల, వీరన్నపేట్ తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పరిగి నుంచి మిట్టకోడూరు గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పనుల దృష్ట్యా కొందరు నీళ్లతో సహసం చేస్తున్నారు. ప్రమాదపు అంచున ఉన్న నీళ్లలో దాటుతున్నారు. తాండూర్ -కొడంగల్ రోడ్డు ఎరాన్‌పల్లి దగ్గర తెగిపోవడంతో ఆమార్గంగుండా గంటపాటుగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఇళ్లలోకి చేరిన వరద నీరు

బొంరాస్‌పేట్ మండలంలో కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాలనీకి చెందిన నీరటి నర్సమ్మ ఇంట్లోకి వరద నీరు రావడంతో రాత్రంతా జాగారం చేశారు. మెట్లకుంట కావలి గేరిలో భారీ వర్షానికి వరద నీరు ఇళ్లలోకి చేరింది. బొంరాస్‌పేట్ పెద్ద చెరువుకు వచ్చే ఏటి కాల్వకు గండి పడటంతో నీరు వృథాగా పోయింది. కాకరవాణి ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా చేరింది. ఏర్పుమళ్ల గ్రామం నుంచి కాకర్లగండి తండాకు వెళ్లే వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సమీప పొలాలకు రైతులు తుంకిమెట్ల మీదుగా రాకపోకలు కొనసాగించారు. మహంతీపూర్ వాగు వరద నీటితో ఉధృతంగా ప్రవహించడంతో అటువైపు ఎవరూ వెళ్లకుండా కంచె ఏర్పాటు చేశారు.


ఆమనగల్లులో ఉధృతంగా పారుతున్న సురసముద్రం అలుగు


తలకొండపల్లి: దేవునిపడకల్‌లో తెగిపోయిన ఈరన్న చెరువుకట్ట

కొడంగల్ యువకుడికి డాక్టరేట్

ఖగోళ శాస్త్ర పరిశోధనలో ప్రదానం

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 8: కొడంగల్ పట్టణం(ఇందిరానగర్)కు చెందిన ఎం. నర్సిములు-నిర్మల కుమారుడు రఘుప్రసాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఆస్ట్రానమీ(ఖగోళశాస్త్రం) విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.రుక్మిణి పర్యవేక్షణలో క్యారెక్టరైజింగ్ సెలెక్టెడ్ మార్జినల్ కాంటాక్ట్ బైనరీస్ యూజింగ్ ఫొటోమెట్రిక్ అండ్ స్పెక్ట్రోస్కోపిక్ అబ్జర్వేషన్ అండ్ వర్చువల్ డాటా అనే అంశంపై పరిశోధనలు చేశాడు. ఈమేరకు పరిశోధన గ్రంథాన్ని యూనివర్సిటీలో సమర్పించగా డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు ప్రకటించినట్లు ఆదివారం రఘుప్రసాద్ తెలిపారు.


టెలిస్కోప్ ద్వారా సూర్య గమనాన్ని పరిశీలిస్తున్న రఘుప్రసాద్

ఆర్థిక ఇబ్బందులతో కానిస్టేబుల్ ఆత్మహత్య

రైలు శరీరంపై నుంచి వెళ్లడంతో వేరైన తల, మొండెం

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ కానిస్టేబుల్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం జరిగింది. అంబర్‌పేట్‌కు చెందిన నర్సింహ రాజు (39) సికింద్రాబాద్‌లోని గోపాల్‌పురం ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని రోజులుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆయన ఆదివారం ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో బైక్‌ను పార్కు చేసి రైలుపట్టాలపై పడుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయనపై నుంచి రైలు వెళ్లడంతో తల, మొండెం వేరయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బైక్‌పై బ్యాగ్‌లో ఉన్న ఆధారాలతో కానిస్టేబుల్ నర్సింహ రాజుగా గుర్తించి ఆయన కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆర్థిక ఇబ్బందులతోనే నర్సింహ రాజు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు వెల్లడించారు.


నర్సింహరాజు(ఫైల్)

కాళోజీ యాదిలో..

కలంతో కవి కాళోజీ చిత్రం గీసిన సూక్ష్మ చిత్రకారుడు డాక్టర్ అశోక్

దౌల్తాబాద్, సెప్టెంబరు 8: మండలంలోని యాంకి గ్రామానికి చెందిన డాక్టర్ సున్నపు అశోక్ సూక్ష్మ చిత్రకళలో సిద్ధహస్తుడు. తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని కవి కాళోజీ బొమ్మ గీసి ఆ సాహిత్య సత్పురుషుడిపై తన కళాభిమానాన్ని చాటుకున్నాడు. ప్రజా కవి, తెలంగాణ ఉద్యమకారుడు, నిజాం నిరంకుశత్వాన్ని ప్రశ్నించిన గొంతుక, ప్రజా చైతన్య మూర్తి, పద్మ విభూషన్ కాళోజీ నారాయణరావు 110వ జయంతి సందర్భంగా ఆ మహనీయుడి యాదిలో తన కలంతో ఆయన చిత్రాన్ని గీసి నివాళులర్పించాడు. ఈ సందర్భంగా పలువురు అశోక్ గీసిన చిత్రాన్ని చూసి అభినందించారు.


అశోక్ గీసిన కాళోజీ చిత్రం

విల్లాల్లోకి నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి


మోకిలాలోని విల్లాల ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్ల, సెప్టెంబరు 8 : శంకర్‌పల్లి మండల పరిధిలోని మోకిలా పరిధిలో ఉన్న లా పాలోమా విల్లాల్లోకి నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం విల్లాల వద్దకు వెళ్లిన ఆమె అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబితారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మోకిలలోని లా పాలోమా విల్లాస్ గేటెడ్ కమ్యూనిటీ జలమయం అయ్యిందన్నారు. ఇరిగేషన్ అధికారులు శాశ్వత పరిష్కారం చేసే విధంగా కృషి చేయాలని సూచించారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మోకిలా ప్రాంతంలో చిన్న చిన్న చెరువులు, కుంటలు, పంటపొలాలు ఉండేవన్నారు. ఇప్పుడు వెంచర్స్ చేయడంతో నాళాలు మూసివేశారని, అవి కూడా కబ్జా కావడంతో నీరు వెళ్లలేని పరిస్థితి నెలకొందని అన్నారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

మున్నూరు రాజుకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

వికారాబాద్, సెప్టెంబరు 8: పద్య సారస్వత పీఠం తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి జెడ్పీహెచ్ఎస్ సిద్దులూర్ పాఠశాల ఉపాధ్యాయులు డా. మున్నూరు రాజు ఎంపికయ్యారు. వికారాబాద్ జిల్లా నుంచి ఎంపికైన ఆయన విద్యారంగంలో చేసిన సేవలకు పురస్కారం వరించింది. వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ, తన ప్రత్యేక బోధనా పద్ధతులతో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దిన రాజు విద్యారంగంలో సలహాలు, సూచనలు అందిస్తూ సేవలందిస్తున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రంగారెడ్డి జిల్లా క్షేత్ర సాహిత్యం- ఒక పరిశీలన అనే అంశంపై ఆయన డాక్టర్ తూర్పు మల్లారెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి ఒక్కో జిల్లాకు ఒక ఉపాధ్యాయుడిని ఎంపిక చేసిన సందర్భంగా వికారాబాద్ జిల్లా నుంచి మున్నూరు రాజును ఎంపిక చేసి ఘనంగా సత్కరించారు. నగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఈనాడు పత్రిక ప్రధాన సంపాదకులు, డీఎన్ ప్రసాద్, ఆకెళ్ల రాఘవేంద్ర, పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.


పురస్కారంతో రాజు

పీపుల్స్ డిగ్రీ కళాశాల స్థలం అందరిదీ


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శశి ప్రభమాణిక్

తాండూరు, సెప్టెంబరు 8: పీపుల్స్ డిగ్రీ కళాశాల స్థలాన్ని అన్యాక్రాంతం చేసి సొమ్ము చేసుకోవాలని యత్నించే వారికి కోర్టు సరైన బుద్ధి చెప్పిందని, ఆ స్థలం తాండూరు ప్రాంత విద్యార్థుల వికాసానికి, ప్రజలకే చెందుతుందని ప్రొఫెసర్ శశిప్రభు మాణిక్‌రావు అన్నారు. ఆదివారం తాండూరులో ట్రస్టు సభ్యులు డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి న్యాయవాది రామకృష్ణ, రఘుతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి మాణిక్ రావు ఆశయంతో పీపుల్స్ డిగ్రీ కళాశాలను ఏర్పాటుచేస్తే.. ఆ స్థలాన్ని రక్షించాల్సింది పోయి కొంత మంది విక్రయించి సొమ్ము చేసుకోవాలని చూశారని ఆరోపించారు. కళాశాలను అభివృద్ధి చేయాలనే మాణిక్ రావు ఆశయాలను నెరవేరుస్తామన్నారు. కళాశాల మేనేజ్మెంట్‌గా చెప్పుకునే వారు, పీపుల్స్ డిగ్రీ కళాశాలను పేరును నిర్వీర్యం చేశారని ఆరోపించారు. మాజీ మంత్రి మాణిక్‌రావు పేరిట కళాశాలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

రుణమాఫీ, అలుగుపారిన చెరువులతో..
రైతుల ముఖాల్లో ఆనందం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, సెప్టెంబరు 8: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కరువు వస్తుందని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ప్రతిపక్షాలు ఇప్పుడు రుణమాఫీ, చెరువులు నిండి అలుగులు పారుతూ.. ఉచిత విద్యుత్ సరఫరా అవుతుంటే మీరు చేసిన ఆరోపణలన్నీ ఎదిర, గుర్రంపల్లి చెరువు అలుగులోపడి కొట్టుకుపోయినట్టేనని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని గుర్రంపల్లి, ఎదిర పెద్ద చెరువు అలుగుల వద్ద గంగమ్మ తల్లికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురికాబడిన ఉమ్మడి కొందుర్గు మండలాభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. ఉమ్మడి మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, చలివేంద్రంపల్లి రాజులు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో మండలాన్ని నిర్లక్ష్యం చేశారని, మీ హయాంలో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

ఇళ్లు కూలిన బాధితులకు సాయమందించాం

ఇటీవల కురిసిన తుఫాను వల్ల ఇళ్లు కూలిపోయిన వారిని గుర్తించి పార్టీ తరఫున ఆర్థిక సాయంతోపాటు నిత్యావసర సరుకులు అందించామని చెప్పారు. బాధితులకు ప్రభుత్వ సహాయం కూడా అందుతుందని తెలిపారు. ఇళ్లు కూలిపోయిన వారందరికీ పక్కా ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే రెండు లక్షల రుణామాఫీలో ఎదురవుతున్న ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకెళ్లామని, అవసరమైతే రూ.2.50లక్షలైనా మాఫీ చేసేందుకు ఆలోచన చేస్తున్నారని తెలిపారు. ప్రతీ రైతుకు రుణమాఫీ అయ్యేలా కృషి చేస్తున్నట్లు వివరించారు. నాయకులు చంద్రశేఖర్, వెంటనర్సింహారెడ్డి, బాల్‌రాజ్, గోపాల్, సలీం, యాదగిరిగౌడ్, అన్వర్, వేణుగోపాల్, నర్సింహులు, రవికుమార్, సురేందర్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండారెడ్డిపల్లి చెరువును మినీట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేద్దాం

కేశంపేట : పోమాల్‌పల్లి-కొండారెడ్డిపల్లి గ్రామ శివారులోని నోటిఫైడ్ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే శంకర్ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్ద చెరువు ఆదివారం అలుగు పారింది. ఎమ్మెల్యే చెరువును సందర్శించి గంగమ్మకు పూజలు చేశారు. దాదాపు 250 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఉన్న పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలని పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరగా.. ఆయన ఇరిగేషన్ అధికారులను హుటాహుటిని చెరువు దగ్గరకి రావాలని చెప్పారు. చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తామని ఎమ్మెల్యేకు తెలిపారు. పల్లె ఆనంద్ కుమార్, పల్లె బాలేశ్వర్, అనుమగళ్ల రమేష్, నిదురం కృష్ణయ్యలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వీరేశ్, రూప్లానాయక్, జగదీశ్వర్, సురేష్‌రెడ్డి, గిరిధర్ యాదవ్, గోపాల్ ముదిరాజ్, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఎదిర పెద్దచెరువు వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


సునీతారెడ్డి, వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కాంగ్రెస్ మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి సునీతామహేందర్‌రెడ్డి
- హస్తం గూటికి చేరిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

శామీర్‌పేట, సెప్టెంబరు 8 : సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీతామహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం శామీర్‌పేటలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వైఎస్ గౌడ్ ఆధ్వర్యంలో బాబాగూడ గ్రామానికి చెందిన దాదాపు 100 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. సునీతామహేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్‌లు సాదరంగా ఆహ్వానించారు. సునీతారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల సహకారంతో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఇతర పార్టీలకు దీటుగా కాంగ్రెస్ కంచుకోటగా తీర్చిదిద్దుతామని చెప్పారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పాలన ఉన్నందున కార్యకర్తలు విభేదాలకు వెళ్లకుండా పార్టీని తీర్చిదిద్దాలన్నారు. వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్‌లు మాట్లాడుతూ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు నామరూపాలు లేకుండా చేసి.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే అత్యధిక మెజార్టీతో గెలుపొందేలా కార్యకర్తల సహకారంతో కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ మేడ్చల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి లతారెడ్డి, నాయకులు మహేందర్‌యాదవ్, కిషోర్ యాదవ్, అశోక్, ఆనంద్, కంఠం క్రిష్టారెడ్డి, జైపాల్ రెడ్డి, దీపక్‌రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

నేడు డీసీసీబీ వైస్ చైర్మన్ ఎన్నిక

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 8 : నేడు డీసీసీబీ వైస్ చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా ఉన్న బి.మనోహర్‌రెడ్డి శాసన సభ ఎన్నిక ముందు రాజీనామా చేశారు. ఆయన తాండూరు శాసనసభ స్థానానికి పోటీ చేసి విజయం సాధించాడు. వైస్ చైర్మన్‌గా ఉన్న కొత్త కుర్మ సత్తయ్యను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. దాంతో వైస్‌చైర్మన్ పోస్టు 9 నెలలుగా ఖాళీగా ఉంది. ఈ పదవిని భర్తీ చేసేందుకు నేడు (సోమవారం) హైదరాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ఉదయం 10 గంటలకు ఎన్నిక జరగనుంది. తాండూరు మండలం ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్న రవిగౌడ్ డీసీసీబీలో డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆయనను వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

బీఆర్ఎస్ నిర్లక్ష్యంతోనే ప్రజల ఇబ్బందులు

కడ్తాల్, సెప్టెంబరు 8: బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్య పాపమే మర్రిపల్లి-ఎక్వాయిపల్లి రోడ్డు పాడై ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగడానికి కారణమని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్ గౌడ్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం బీటీ రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరు చేసినట్లు అప్పటి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ప్రకటించినా పనులు చేపట్టలేదని గుర్తుచేశారు. ఎక్వాయిపల్లి- మర్రిపల్లి రోడ్డు వర్షానికి చాలా చోట్ల కొట్టుకుపోయింది. ఆదివారం స్థానిక నాయకులతో కలిసి రవికాంత్ గౌడ్ రోడ్డును పరిశీలించారు. నాయకులు నారాయణ గౌడ్, మల్లేశ్‌గౌడ్, రాజు, గౌతమ్, నర్సింహ, జంగయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.


వర్షానికి కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న పాలకుర్ల రవికాంత్ గౌడ్



సండే సందడి

కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద ఆదివారం సందర్శకులు సందడి చేశారు. ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ సరదాగా గడిపారు. అలుగులోకి సందర్శకులను అనుమతించకపోవటంతో ప్రాజెక్టు పరిసరాలలోనే ఎంజాయ్ చేశారు. - ధారూరు, సెప్టెంబరు 8

నకిలీ బంగారు నాణేల పట్టివేత

ముగ్గురు నిందితుల రిమాండ్

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 8 : నకిలీ బంగారు నాణేలను అసలైన బంగారు నాణేలని నమ్మించి ఎక్కువ ధరకు విక్రయించాలని యత్నించిన ముగ్గురిని షాద్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడివెండి గ్రామానికి చెందిన భాషపాక సుజిత్, భాషపాక రమేశ్ అదే జిల్లా పాలకుర్తి మండలం మైత్తర గ్రామానికి చెందిన పలనాటి అశోక్ ముగ్గురు ఓ ముఠాగా ఏర్పడ్డారు. వీరు కర్ణాటకలోని బళ్లారిలో మహేశ్ అనే వ్యక్తి దగ్గర నకిలీ బంగారు నాణేలు కొనుగోలు చేశారు. ఈ నెల 5న రాత్రి షాద్‌నగర్ మీదుగా వాటిని హైదరాబాద్ తరలిస్తుండగా షాద్‌నగర్ పోలీసులు రాయికల్ టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నారు. ముగ్గురినీ శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


పట్టుబడిన నకిలీ బంగారు నాణేలు


ఘట్‌కేసర్: వినాయక పూజలో పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి


తాండూరు: పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి తనయుడు రినేష్ రెడ్డి


మేడ్చల్ టౌన్: శివాజీ యువజన సంఘం వారు ప్రతిష్ఠించిన వినాయకుడు


ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో వినాయక పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


తాండూరు: భద్రేశ్వర్ చౌక్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మంత్రి ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వనాథ్ గౌడ్

కొలువుదీరిన గణనాథులు

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో గణనాథులు కొలువుదీరారు. గణేశ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆయా కాలనీలు, గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసి వినాయకులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగు, రంగుల విద్యుత్ దీపాలతో ఎంతో చక్కగా అలంకరించారు. పలువురు ప్రజాప్రతినిధులు గణనాథుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదానం చేశారు.


కొడంగల్ రూరల్: హస్నాబాద్‌లో వివేకనంద యువజన సంఘం ఆధ్వర్యంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు


పూడూరు: మండల పరిధిలోని చీలాపూర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గ్రామస్తులు


కొడంగల్: లాహోటీ కాలనీలో గణేశ్ మండపంలో మాజీ సర్పంచ్ అనితా పకీరప్ప పూజలు


తాండూరు: వినాయక్ చౌక్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గణేశుడు


శామీర్‌పేట్: దేవరయాంజాల్‌లో విగ్నెట్ వింగ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ పూజలు


తాండూరు రూరల్: గౌతాపూర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి పూజలు


కులకచర్ల: హనుమాన్ ఆలయం వద్ద వినాయకుడి పూజలో పాల్గొన్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి


కీసర రూరల్: అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి


కీసర: శ్రీ చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడు


ఘట్‌కేసర్ రూరల్: మర్రిపల్లిగూడలో స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు వినాయక మండపంలో యూత్ సభ్యులు


తాండూరు: మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న నివాసంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు


కొడంగల్: కార్గిల్‌కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో యువకుల పూజలు


దోమ: వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య


ఘట్‌కేసర్: వివేకానంద యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్న చైర్‌పర్సన్ ముల్లి పావని


బొంరాస్‌పేట్: భూలక్ష్మమ్మ చౌరస్తాలో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎంపీపీ శ్రావణ్‌గౌడ్ తదితరులు

స్కావెంజర్లను నియమించాలి

వికారాబాద్, సెప్టెంబరు 8 : పాఠశాలలో స్కావెంజర్లను వెంటనే నియమించాలని, ఉద్యోగులకు రావాల్సిన నాలుగు 4డీఏలను వెంటనే విడుదల చేయాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ అన్నారు. వికారాబాద్ మండల సర్వసభ్య సమావేశం పట్టణంలోని ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చక్రాల కేదార్‌నాథ్, ప్రధాన కార్యదర్శిగా పి.రాఘవేంద్ర, గౌరవ అధ్యక్షులుగా సతీష్‌కుమార్, అసోసియేషన్ అధ్యక్షులుగా సీహెచ్ శ్రీనివాస్, ఎండీ ఇబ్రహీం, మహిళా అధ్యక్షురాలుగా సునీత మేరి, ఉపాధ్యక్షులుగా ఎండీ తాజుద్దీన్, కార్యదర్శిగా స్వరూప, గోపాల్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గంలో గెజిటెడ్ హెచ్ఎంలు వీరకాంతం, రాజశేఖర్, రామకృష్ణారెడ్డి, రాష్ట్ర బాధ్యులు వీరేశం, అంజిరెడ్డి, రమేష్ సిందే, ఎండీ జాంగీర్, కృష్ణారెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

ఘట్‌కేసర్, సెప్టెంబరు 8: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్ సర్వసభ్య సమావేశం రసాభాసగా జరిగింది. స్థానిక కళావేదికలో ఆదివారం టౌన్‌షిప్ అధ్యక్షుడు బెజ్జంకి హరిప్రసాద్‌రావు అధ్యక్షతన జరిగిన సర్వ సభ్య సమావేశంలో పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు బద్దం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ టౌన్‌షిప్‌లో ఇష్టానుసారంగా గడీల పాలన జరుగుతోందని ఆరోపించారు. కనీసం మాట్లాడే అవకాశం ఇవ్వకుండా గొంతు నొక్కేస్తున్నారని అన్నారు. బడ్జెట్‌లో అన్ని అవకతవలే జరిగాయని, ఇదేమని అడిగితే సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారని ఆరోపించారు. అంతకు ముందు పలువురు నాయకులు మాట్లాడుతూ టౌన్‌షిప్ ఎ పరిస్థితి పేరుగొప్ప ఊరుదిబ్బగా మారిందన్నారు. చిన్నచిన్న పనులు చేసి ఎంతో గొప్పగా చెప్పుకుంటున్నారని, గతంలో ఇంతకంటే గొప్ప పనులు జరిగాయన్నారు. ఒకరినొకరు దూషించుకుంటూ అసోసియేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా టౌన్‌షిలో సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలక వర్గం సభ్యులు, ప్లాట్ల ఓనర్లు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయ సంఘ నేత మృతి

పరిగి, సెప్టెంబరు 8: బహుజనవాది, పిఆర్‌టియూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, హెడ్‌మాస్టర్ టి.వెంకటయ్య(57) గుండెపోటుతో కన్నుమూశారు. గండీడ్ మండలం గాధిర్యాల్ గ్రామానికి చెందిన వెంకటయ్య పరిగిలో స్థిరపడ్డారు. పరిగి మండలం కాళ్ళాపూర్ యూపీఎస్ స్కూల్‌లో హెచ్ఎంగా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి ఇంట్లో గుండెపోటు రావడంతో స్థానికంగా ప్రాథమిక చికిత్సలు చేయించారు. అనంతరం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడు వెంకటయ్యకు భార్య పద్మ, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పి.చంద్రయ్య, మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, ప్రధానకార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, ఆయా పార్టీల,సంఘాల నాయకులు సురేందర్, బి.ప్రవీణ్‌రెడ్డి, పరశురాంరెడ్డి, ఇ.కృష్ణ, ఆనందం, ఇ.రాములు తదితరులు వెంకటయ్య భౌతిక కాయానికి నివాళులర్పించి సంతాపాన్ని తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన స్వగ్రామమైన గాధిర్యాల్‌లో అంతక్రియలు జరిగాయి.

వినాయక మండపంలో ఎస్పీ పూజలు

వికారాబాద్, సెప్టెంబరు 8: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని అతిపెద్ద వినాయకుడైనా ఇందిరానగర్ వినాయకుడి వద్ద వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు కాలనీ కౌన్సిలర్ బొండల సువర్ణ అశోక్, కాలనీ పెద్దలు శ్రీనివాస్‌గౌడ్, బొండల శ్రీనివాస్‌లు స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం ఘనంగా సన్మానించారు. ఎస్పీతో పాటు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ చిగుళపల్లి రమేష్‌లు భారీ గణనాథుడిని దర్శించుకుని పూజలు చేశారు. ఇందిరానగర్ వినాయకుడి వద్ద కాంగ్రెస్ సీనియర్‌నాయకులు శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సమేతంగా ప్రత్యేకపూజలు నిర్వహించి అన్నదానం చేపట్టారు. ఈ వేడుకల్లో కాలనీవాసులు రమేష్‌గౌడ్, విజయ్, బొండల శేఖర్, బొండల మల్లేశ్, శేఖర్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, ప్రశాంత్‌గౌడ్ కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.


ఇందిరానగర్ వినాయకుడి వద్ద పూజలు చేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

మాజీ మంత్రి మాణిక్‌రావుకు ఘన నివాళి

తాండూరు, సెప్టెంబర్ 8: మాజీ మంత్రి, దివంగత నేత మాణిక్‌రావు వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం ఆయన సతిమణి ప్రొఫెసర్ శశి ప్రభ మాణిక్‌రావు ఆధ్వర్యంలో ఆస్పత్రిలో రోగులకు అన్నదానం చేశారు. అనంతరం మాణిక్ రావు చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, ఆర్‌బీఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, విద్యా వికాస్ ట్రస్ట్ ప్రతినిధులు రామకృష్ణ, రఘు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్ నివాళులర్పించారు. ఎంపీటీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన మాణిక్‌రావు వర్ధంతి కార్యక్రమాన్ని మహారాజు కుటుంబం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు రాకేష్, ధారాసింగ్, మాజీ సర్పంచ్ ఉత్తం చంద్, మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి తనయుడు రీనేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాణిక్‌రావుకు నివాళులర్పిస్తున్న ఆయన సతీమణి ప్రొఫెసర్ శశి ప్రభ

కుక్కల బెడద లేకుండా చర్యలు

వికారాబాద్, సెప్టెంబరు 8: స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కుక్కల బెడద లేకుండా చర్యలు లేకుండా చర్యలు చేపట్టినట్లు మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్ అన్నారు. వికారాబాద్ శివారెడ్డిపేట సమీపంలో ఏర్పాటు చేసిన యనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వికారాబాద్ పట్టణంలో 1300 కుక్కలు ఉన్నట్లు అధికారులు గుర్తించడం జరిగిందని, వాటికి సర్జరీలు చేయడాన్ని అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ చొరవతో వెటర్నిటీ డాక్టర్లతో సర్జరీలు చేయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కమలనగర్ కాలనీ నుంచి తీసుకెళ్లిన 13 కుక్కలకు సర్జరీలు చేసినట్లు తెలిపారు. త్వరలోనే వికారాబాద్ పట్టణంలో కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **పరిగి:** అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన విలేకరి బి.రాజు, చౌడాపూర్ మండలానికి చెందిన విలేకరి ఉదయ్ కుటుంబాలకు ప్రెస్‌అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. మృతుల భార్యలకు నెలకు రూ.3వేల చొప్పున, ఇద్దరి పిల్లల ట్యూషన్ ఫీజుల కోసం నెలకు రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సాయానికి సంబంధించి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు శ్రీధర్, రాఘవేందర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

● **మేడ్చల్ టౌన్:** మేడ్చల్-సికింద్రాబాద్ రూట్‌లో మేడ్చల్ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా మెట్రో డీలక్స్ బస్సు పర్వీసులను సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు డీఎం సుధాకర్ తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 6:35 నిమిషాలకు మొదటిబస్సు మేడ్చల్ డిపో నుంచి ప్రారంభమవుతుందన్నారు. సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రాత్రి 8:55 చివరి బస్సు మేడ్చల్ డిపోకు బయల్దేరుతుందని తెలిపారు. ప్రతీ 25 నిమిషాలకు ఒక సర్వీసు నడుస్తుందని తెలిపారు. ఈ బస్సుల్లో టీఏవైఎల్ టికెట్, ఆర్డినరీ, మెట్రో పాస్లతో పాటు మహిళలకు ఉచిత ప్రయాణం వర్తించదని తెలిపారు.

● **మేడ్చల్ టౌన్:** బీసీ కమిషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా నియమితులైన గోశెట్టి నిరంజన్‌ను ప్రదేశ్ కాంగ్రెస్ కో ఆర్డినేటర్, గౌడవెల్లి గ్రామ మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ ఆదివారం మర్యాదపూరకంగా కలిశారు. ఈ సందర్భంగా సురేందర్ నిరంజన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు.

● **మేడ్చల్ టౌన్:** మేడ్చల్, దుండిగల్ మండలాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మేడ్చల్‌లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 10, 11, 12వ తేదీల్లో జోనల్ స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జోనల్‌కార్యదర్శి ఎన్.వెంకటనారాయణ ప్రకటనలో పేర్కొన్నారు.

● **పరిగి:** సయ్యద్‌పల్లిలో ఉర్సు ఉత్సవాల్లో భాగంగా పరిగి ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి ఆదివారం దర్గాను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. ఈ ఉత్సవంలో మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మన్లు ఆర్.అంజనేయులు, సురేందర్ పాల్గొన్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఘనాపూర్‌కు చెందిన మేడ్చల్ బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్ ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మేడ్చల్‌లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీర్జాదీగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, నాయకులు సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

● **తాండూరు రూరల్:** పీఆర్టీయూటీఎస్ తాండూరు మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జొన్నల వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పట్లోళ్ల పురుషోత్తంరెడ్డి, అసోసియేట్ ఎస్.ప్రభు, ఉపాధ్యక్షుడిగా ఎం.బాల్‌రాజ్, ఎ.నరేందర్, మహిళా ఉపాధ్యక్షులు స్వాతి, కార్యదర్శి శ్రీశైలం, మహిళా కార్యదర్శి శారదను ఎన్నుకున్నారు. వీరికి ఎన్నిక ధృవపత్రాన్ని జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి అందజేశారు.

● **తాండూరు:** హిందూ ఉత్సవ కేంద్ర సమితికి మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి తనయకుడు రీనేష్‌రెడ్డి రూ. 2లక్షల 50వేల విరాళాన్ని ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులుకు అందజేశారు. అదే విధంగా వివిధ గణేషుల మండపాలకు రూ. 50వేల నగదును అందించారు.

● **ఘట్‌కేసర్:** నూతనంగా టీపీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన మహేష్‌కుమార్ గౌడ్‌ను ఆదివారం ఘట్‌కేసర్ మండలంలోని చౌదరిగూడ కాంగ్రెస్ నాయకులు భాస్కర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

● **పూడూరు:** మండల పరిధిలోని కంకల్‌లో వీరభద్రత యూత్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ నిర్వహించారు. గ్రామంలోని పంచాయతీ సమీపంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో వీరభద్రేశ్వర స్వామి యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వాగులో శిశువు మృతదేహం లభ్యం

దౌల్తాబాద్, సెప్టెంబరు 8: అప్పుడే పుట్టిన శిశువు(ఆడ) మృతదేహం లభ్యమైన ఘటన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని గోకపస్లాబాద్ గ్రామ శివారులోని తంగెడుకుంట దగ్గర గల వాగులో గుర్తుతెలియని వ్యక్తులు శిశువును పడేశారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న ఎస్ఐ రవిగౌడ్, పోలీసు సిబ్బంది మృతశిశువును కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శి మాల నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపపారు.

చెరువుకు గండికొట్టిన జేసీబీ సీజ్

కులకచర్ల, సెప్టెంబరు 8: చెరువుకు గండి కొట్టిన జేసీబీని పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. చౌడాపూర్ మండలం లింగంపల్లి గ్రామపరిధిలో చెరువు నిండి అలుగు పారుతోంది. చెరువు శిఖంలో ఉన్న రైతు తన పంటను కాపాడుకునేందుకు కట్టను జేసీబీతో పగలగొట్టేందుకు ప్రయత్నించాడు. ఈ విషయాన్ని రైతులు కలెక్టర్ ప్రతీక్‌జైన్ దృష్టికి తీసుకెళ్లగా రెండు రోజుల కిందట ఆయన గ్రామానికి వచ్చి పరిశీలించారు. చెరువు కింది రైతులు ఫిర్యాదు చేయడంతో నీటిపారుదల శాఖ ఏఈ శ్రీనివాస్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి జేసీబీని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.


వినాయకుడి భజనతో అశ్లీల వీడియో పోస్ట్ చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 8: వినాయకుడి భజనను జోడించి అశ్లీల వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన వ్యక్తి పై ఆదివారం మేడ్చల్ పట్టణానికి చెందిన గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పాతూరి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు జాకట ప్రేమ్‌దాస్, రామన్నగారి శ్రీనివాస్‌గౌడ్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిందువుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా గణేశ్ నవరాత్రోత్సవాల వేళ వినాయకుడిని కించపరిచే విధంగా అశ్లీల వీడియోను పోస్ట్ చేశాడని, అతడిపై కేసు నమోదు చేయాలని వారు. కోరారు. సామరస్యంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించుకునే ప్రాంతాల్లో మత విద్వేషాలను ప్రేరేపించడానికి ప్రయత్నించే దుష్టశక్తులపై కఠినంగా వ్యవహరించాలని బీజేపీ నాయకులు పోలీసులను కోరారు.

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడికి గాయాలు

కులకచర్ల, సెప్టెంబరు 8: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై పంచాయతీ కార్మికుడికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. శనివారం గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర తీగలు ఊడిపోవడంతో గమనించిన పంచాయతీ కార్మికుడు రాములు ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర విడిపోయిన తీగలను సరిచేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతన్ని స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తృటిలో ప్రమాదం తప్పిందని తోటి కార్మికులు తెలిపారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రాములు విద్యుదాఘాతానికి గురైనట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం


భీమమ్మ

తాండూరు రూరల్, సెప్టెంబరు 8: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మనవన్ని చూసేందుకు వెళ్లిన నాయనమ్మ తప్పిపోయింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తాండూరు మండలం దస్తగిరిపేట్‌కు చెందిన కుమ్మరి భీమమ్మ మనవడు గుండె సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. భీమమ్మ ఆసుపత్రిలో ఉన్న తన మనవన్ని చూసేందుకు కుటుంబసభ్యులతో కలిసి వెళ్లింది. భీమమ్మకు కల్లుతాగే అలవాటు ఉండటంతో ఆమె ఆసుపత్రి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటి కి వెళ్లింది. అలా వెళ్లిన ఆమె మూడురోజులుగా తిరిగి రాలేదు. కుటుంబీకులు కిమ్స్ ఆస్పత్రి సమీపంలో ఉన్న రాంగోపాల్‌పేట్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎకరాకు రూ.20వేల చొప్పున పరిహారం ఇవ్వాలి

వికారాబాద్, సెప్టెంబరు 8: జిల్లాలో అధిక వర్షాలతో లక్షలాది ఎకరాలు పంట నష్టం జరిగిందని, ప్రభుత్వం ప్రతీ ఎకరాకు రూ. 20 వేల చొప్పున పంట నష్ట పరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నాయకులు సతీష్, శ్రీనివాస్, అగ్బర్, ముత్యం తదితరులు పాల్గొన్నారు.